# ఈవారం కథ

ఆ ఊళ్ళో అందరికీ తిక్కలాడు సుపరిచితుడే. నిజానికి వాడికి ఆ పేరు పెట్టింది ఆ ఊరి ప్రజలే. వాడి అమాయకత్వం, తనలో తను మాట్లాడుకోవడం, పాటలు పాడుకోవడం, నవ్వుకోవడం మొదలైనవి చూసి ఆ ఊరి ప్రజలు వాడికి 'తిక్కలాడు' అని నామకరణం చేసారు. ఏది ఏమైనా తిక్కలాడు తిక్కలాడేగాని పిచ్చివాడు మాత్రం కాదు.

రైసుమిల్లు ఎలమంద, కిళ్ళీ కొట్టు మస్తాను, కిరాణా కొట్టు రంగయ్య, సారా కొట్టు వీరన్న ఒకరేమిటి అందరూ తిక్కలాడి నుండి ఏదో ఒక సహాయం పొందేవాళ్ళే. ఆ ఊళ్ళో వాళ్ళకి ఏ అవసరం వచ్చినా ముందుగా గుర్తొచ్చేది తిక్కలాడి పేరే.

పంట రోజుల్లో పొలం పనులు చెయ్యడం, వడ్ల బస్తాలు బండ్లలోకి ఎత్తడం, మిల్లుకు చేర వెయ్యటం, నీళ్ళు చేరవెయ్యడం, వెచ్చాలు తెచ్చి ఇవ్వటం, గొడ్లను మేతకి తీసుకెళ్ళటం వంటి పనులు తిక్కలాడు తన కిష్టమైతే చేస్తుంటాడు. తనకు నచ్చిన వాళ్ళకు పనులు ఊరికే చేసిపెడతాడు. కూలి మాట్లాడుకుంటే ఏమాత్రం రాజీపడడు. తనకిష్టం లేకపోతే బ్రహ్మదేవుడు దిగివచ్చినా ఏ పనీ చెయ్యడు. వాడి తత్వం తెలిసిన వాళ్ళు వాడితో జాగ్రత్తగా పనులు చేయించుకుంటారు. కొంతమంది ఆకతాయి మూక వాడితో కావాలని కయ్యానికి దిగి వాడు బండ బూతులు తిడుతుంటే ఆనందపడతారు.

తిక్కలాడి తల్లి వాడి చిన్నప్పుడే పోయింది. వాడి తండ్రి దేశాలు పట్టుకు పోయాడు. వాడికి నా అనే వాళ్ళెవరూ లేరు. కానీ ఆ ఊరి ప్రజలంతా వాడికి చుట్టాలే! తిక్కలాడ్ని చీదరించుకొనేవారు కొందరైతే, వాడు ఎదురైతే అపశకునమని భావించేవారు ఇంకొందరు. వాడ్ని చూసి జాలిపడి అన్నం పెట్టేవాళ్ళు కొందరైతే పిల్చి చీవాట్లు చెప్పుదెబ్బలు పెట్టేవాళ్ళు ఇంకొందరు. అలాంటి వాళ్ళంటే తిక్కలాడికి ఎక్కడలేని కోపం. అయినా తిక్కలాడికి ఆ ఊరే సర్వస్వం.

తిక్కలాడికి ఉన్నదీ, ఆ ఊళ్ళో వాళ్ళకు లేనిదీ ఒకటే; అది ఆనందం. ఎప్పుడూ ఆనందంగా ఉండటమే తిక్కలాడి ప్రత్యేకత. భూత భవిష్యత్తులు వాడికి అక్కర్లేదు. వర్తమానమే కావాల్సింది. వాడికి ఆ రోజు గడిస్తే చాలు ఏ బాదరబందీ లేదు. లేనిపోని ఆట్టహాసాలు లేవు. ఎప్పుడూ పసిబాలునివలె స్వచ్ఛమైన మనసు కలిగి ఉంటాడు. తనలో తను ఏవో రాగాలు తీస్తూ, పాడుకుంటూ తన్మయత్వంలో ఉంటాడు. ఎవరెన్ని తిట్టినా, కొట్టినా పెద్దగా పట్టించుకోడు. అతని కోపం తాత్కాలికమే. అన్నీ ఇట్టే మర్చిపోతాడు.


తిక్కలాడు దైవభక్తుడు కూడా! వాడు ప్రతి రోజూ ఉదయాన్నే లేచి ఊరి చెరువులో ఈత కొట్టి ఆ ఊరి నాలుగురోడ్ల కూడలిలో ఉన్న రాములవారి గుడికెళ్ళి పరుగు పరుగున 'ఒరేయ్ రాముడా దేవుడా రక్షించు' అంటూ ఎన్నో కొన్ని ప్రదక్షిణలు చేసి ప్రసాదం కోసం వరుసలో నిలబడతాడు. ఆ గుడి పూజారి దేవుడ్ని 'ఒరేయ్' అని పిలువకూడదని చెప్పినా తిక్కలాడు వినడు. వాడి దృష్టిలో దేవుడు కూడా ఒక మనిషే. వాడి నిష్కల్మషమైన భక్తికి మెచ్చి దేవుడు వాడు పడుకొనేందుకు వీలుగా ఆ గుడిలో చోటు ఏర్పాటు చేశాడు. తిక్కలాడే ఆ గుడి కాపలాదారు. రోజూ వాడి రాత్రి బస ఆ గుళ్ళోనే.

తిక్కలాడు అన్యాయం ఏమాత్రం సహించలేడు. అందునా అన్యాయం తనకు జరిగితే అసలు సహించలేడు. ఎవరైనా తనకు అన్యాయం చేస్తే తనకొచ్చిన బండ బూతులన్నీ వాడి వాళ్ళ పరువు కాస్తా బజారు పాలయ్యేట్లుగా వీధి వీధికీ తిరిగి ప్రచారం చేస్తాడు. ఆ ఊళ్ళో అందరికీ తెలుసు తిక్కలాడు ఊరికే ఎవరి జోలికీ వెళ్ళడని. ఎంత అన్యాయం తనకు జరిగినప్పటికీ మరునాడే అన్నీ మర్చిపోయే మనస్తత్వం కలవాడు తిక్కలాడు.

ఒకరోజు ఆ ఊళ్ళో పోలేరమ్మ జాతరయ్యింది. సారా కొట్టు వీరన్న విప్పసారా తయారుచేసి తెచ్చాడు. పంచాయతీ అరుగుమీద కూర్చొని పేకాడుతూ, చుట్టలు కాలుస్తూ, రైసుమిల్లు ఎలమంద, కిళ్ళీకొట్టు మస్తాను, కిరాణా కొట్టు రంగయ్య ఇంకో ఇద్దరు సారా తాగడం మొదలుపెట్టారు. బాగా తాగారు. పీకలదాకా తాగారు. ఇంతలో తిక్కలాడు అటుగా ఏవో పాటలు పాడుకుంటూ వచ్చాడు. వాడ్ని చూడగానే ఈ తాగుబోతులకి ఏడిపించాలనే దుర్బుద్ధి పుట్టింది. వెంటనే ఎలమంద తిక్కలాడ్ని పిలిచి తన ఇంటివద్దవున్న పది వడ్ల బస్తాలను రైసుమిల్లుకు చేరవేసే పని పురమాయించాడు. ఆ పనిచేసిన తరువాత అయిదు రూపాయిల కూలి ఇచ్చేట్లుగా కూడా చెప్పాడు. తిక్కలాడికి ఎలమంద అంటే కోపం. ఎప్పుడు కనబడినా చీవాట్లు పెట్టే మనిషి. అసలు ఎలమంద ఏ పనిచెప్పినా తిక్కలాడు అయిష్టంగానే చేస్తాడు. ఆ రోజెందుకో ఏ తల్లికీ దయరాలేదు. తిక్కలాడి పొట్టనిండలేదు. ఆకలి మండిపోతూంది. అయిదు రూపాయలు వస్తాయనే ఆశతో తిక్కలాడు ఎలమంద ఇంటికెళ్ళి వడ్ల బస్తాలను ఎడ్ల బండిలోకి ఎక్కించి, బండిని మిల్లుకి తోలికెళ్ళి, వడ్ల బస్తాలను మిల్లులో దింపి, బండి తోలుకొని మళ్ళీ ఎలమంద దగ్గరికొచ్చాడు. ఎండ మండిపోతూంది. నోరు పిడచకట్టుకు పోతూంది.



# తిక్కలాడు



— రెండుచింతల భానుప్రసాదు

బండి దిగి ఎలమందతో 'అన్నా! బస్తాలట్టికెళ్ళి మిల్లుకాడ పోసొచ్చాను; డబ్బులియ్యి' అన్నాడు తిక్కలాడు. వెంటనే ఆ మూకంతా ముందను కున్న ప్రకారం విరగబడి నవ్వడం మొదలెట్టారు. తిక్కలాడు నిస్సుడయ్యాడు. 'ఏం డబ్బులురా' అన్నాడు ఎలమంద. 'డబ్బులెందుకు ఓ సుక్కేసుకో' అన్నాడు మస్తాను. మళ్ళీ వాళ్ళంతా పగలబడి నవ్వసాగారు. వాళ్ళకి నిషా తలకెక్కింది. 'అన్నా నువ్వేకదా ఒడ్లు మిల్లుకు చారెయ్యమన్నావు అయిదు రూపాయలిస్తానన్నావ్, లే...యిచ్చెయ్యి' అన్నాడు తిక్కలాడు. 'ఒర్నీ సిగతరగ డబ్బులిస్తాగానీ ఓ రెండు గుక్కలేసికో' అన్నాడు ఎలమంద తన ఎంగిలి గ్లాసులో సారా వంపుతూ. తిక్కలాడు గతంలో ఎవ్వడూ తాగలేదు. ఎవరూ తాగించ లేదు. అసలెందుకు తాగుతారో తెలియదు. బాగా దాహంతో ఉండటంతో అవేవో సోడా నీళ్ళనుకొని గటగటా తాగేశాడు. ఈసారి వీరన్న ఇంకొంచెం సారా పోశాడు 'తాగరా తాగు బలె రంజుగుంటదిలే' అంటూ. ఈసారి కూడా డబ్బులొస్తాయన్న ఆశతో తాగాడు తిక్కలాడు. ఇట్లా పీకలదాకా తాగించారు. తిక్కలాడికి కళ్ళు తిరగసాగాయి; బైర్లు కమ్ముతున్నాయి. 'అన్నా నా డబ్బులు నా కిచ్చెయ్యి నే గుడికిపోతా' అన్నాడు తిక్కలాడు ముద్ద ముద్దగా. 'ఎంతరా నీకియ్యాల్సింది' అన్నాడు ఎల్లమంద. 'అయిదు' అన్నాడు తిక్కలాడు. వెంటనే తిక్కలాడి చెంపమీద 'ఒకటి' అంటూ దెబ్బ వేశాడు ఎలమంద. ఆ తరువాత అక్కడున్న ఒక్కొక్కరూ అయిదు వరకూ లెక్క పెడ్తూ తిక్కలాడి చెంపలు ఛెళ్ళుమనిపించారు. తిక్కలాడు పెద్దగా పట్టించుకోలేదు. ఇంతలో తప్పతాగివున్న రంగయ్య తిక్కలాడి నెత్తిమీద సారా పోశాడు. 'దొంగనాయాల ఊరిమీదపడి పొట్టపోసుకునే వాడ్కి డబ్బులెందుకుబే' అంటూ తూలవాడాడు వీరన్న. తిక్కలాడికి నిషా తలకెక్కింది. మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతూంది. ఓపిక నశించిపోతూంది. తనకు జరిగే అన్యాయం సహించలేక పోతున్నాడు తిక్కలాడు. ఇంతలో 'ఒరేయ్ తిక్కనాయాల యాభై గుంజీలు తియ్యరా నీ డబ్బులిచ్చేస్తా; సత్తె ప్రమాణికం' అన్నాడు ఎలమంద. తిక్కలాడు అప్పటికే సరిగ్గా నిలబడలేక పోతున్నాడు. ఎండ మండిపోతూంది. కాళ్ళు కాలిపోతున్నాయి. తూలిపోతున్నాడు. అయినా ఆశ చావక గుంజీలు తియ్యటం ప్రారంభించాడు.

'ఒకటి, రెండు, మూడు...ఇరవై, ఇరవై ఒకటి, ఇరవై రెండు, పదమూడు, పధ్నాలుగు, పదిహేను... ముప్పై, ముప్పై ఒకటి, ముప్పై రెండు...పంతొమ్మిది, ఇరవై...అంటూ లెక్కపెట్టసాగాడు ఎలమంద. ఎంతసేవు గుంజీలు తీసినా యాభై కావటం లేదు. 'అన్నా నువ్వు తప్ప లెక్కెడుతున్నావ్' అన్నాడు తిక్కలాడు అతి కష్టంమీద లేస్తూ. తిక్కలాడికి నిషా తగ్గటం మొదలయింది. 'మొండి నాయాల నాకు లెక్క రాదంటావంట్రా' అంటూ తిక్కలాడి చొక్కా పట్టుకు లాగాడు ఎలమంద. చొక్కా చిరిగింది. తిక్కలాడికి తన గుండె ఎవరో చించినట్లయింది. పూజారిగారి భార్య యిచ్చిన చొక్కా అది. మూడు నెలల నుండీ తొడుగుతున్నాడు. తిక్కలాడు కోపాన్ని దిగమింగుకుంటున్నాడు.'ఒర్రె ఎలమంద! ఈణ్ణింక యిడిసిపెట్టు ఆడే పోతాడు' అన్నాడు సారా కొట్టు వీరన్న.' వీరన్న మాట అనుసరిస్తున్నట్టుగా 'ఒరేయ్ తిక్క నాయాల వంగి మా యందరి కాళ్ళకి దణ్ణం పెట్టుకో; నిజంగా నీ డబ్బులిచ్చి పారదొబ్బుతా' అన్నాడు ఎలమంద. తిక్కలాడు ఆత్మాభిమానం కలవాడు. ఇట్లాంటి పని చెయ్యమని గతంలో ఎవరూ అతడ్ని అడగలేదు. అయినా చేసేది లేక అందరి కాళ్ళకూ డబ్బుల కోసం వంగి నమస్కారం చేశాడు. చివరికి ఎలమంద తన లాల్చీ జేబులోంచి ఓ రూపాయి పావలా తీసి తిక్కలాడి చేతిలో పెట్టి 'తీసుకో తిక్కసచ్చిన నాయాల' అంటూ డొక్కలో ఒక్క తన్ను తన్నాడు.

ఆ తావుకి తిక్కలాడు పక్కనున్న కరెంటు స్తంభానికి గుద్దుకున్నాడు. తిక్కలాడి కళ్ళు బైర్లు కమ్మాయి. నిషా పూర్తిగా దిగిపోయింది. వాడి ముక్కులోంచి రక్తం కారుతోంది. తిక్కలాడి ఓర్పు, సహనం భగ్నమయ్యాయి. తనని తాను నిగ్రహించుకోలేక పోతున్నాడు. నరాలు తెగిపోయేటువంటి బాధ. తనకి జరిగిన అన్యాయం సహించలేక పోతున్నాడు. ఒంటిపైనున్న చిరిగిన చొక్కాతో ముక్కు తుడుచుకున్నాడు. అయినా రక్తం వస్తూనే వుంది. ఆ మూక తమకదేమి పట్టనట్టు ఇంకా తాగుతూనే ఉంది. తిక్కలాడి ఆవేశం కట్టలు తెంచుకుంది. ప్రతీకారంతో గుండె రగిలిపోతోంది. 'అరేయ్ దొంగ లంజ కొడకా' అంటూ కిందనున్న నాపరాయిని తీసి బలంగా ఎలమంద మీదకి విసిరాడు తిక్కలాడు. ఆ రాయి గురితప్పకుండా ఎలమంద మొహాన్ని తాకింది. ఎలమంద ముక్కు బద్దలైంది. రక్తం కారుతోంది. ఊహించని ఈ సంఘటనకు వీరన్న, రంగయ్య, మస్తానులు ఖిన్నులయ్యారు. ఇంతలో తిక్కలాడు పక్కనే వున్న ఎడ్ల బండిలోని కర్రను లాగి స్వైర విహారం చేశాడు. వీరన్న, రంగయ్య, మస్తాను, ఎలమంద ఇంకా ఎవరడ్డమొస్తే వారిని ఇష్టమొచ్చినట్లు బాదుతున్నాడు. తనేం చేస్తున్నాడో తనకి తెలియదు. వీరన్న తల పగిలింది. మస్తాను మెడ ఎముక విరిగినట్లయ్యింది. ఎలమంద ఎడమ చెయ్యి బొటనవేలు విరిగింది. ఇంతలో తిక్కలాడికి భయపడి దూరంగా జరిగిన రంగయ్య తన చేతి కందిన సారా సీసాను బలంగా తిక్కలాడి మీదకు విసిరాడు. ఆ సీసా తిక్కలాడి కుడి మోచేతికి తగిలి ముక్కలయింది. తిక్కలాడి చేతిలోని కర్ర పట్టు జారింది. అదే అదనుగా మస్తాను తిక్కలాడి చేతిలో కర్రను బలంగా లాగాడు. తిక్కలాడి చేతిలో కర్ర మస్తాను చేతిలోకి వెళ్ళింది. వెంటనే మస్తాను తిక్కలాడి వీపుమీద బలంగా ఆ కర్రతో కొట్టాడు. ఆ దెబ్బకు తిక్కలాడి వీపు చిట్లి రక్తం కారుతోంది. ఇక ఏం చెయ్యాలో తెలియక తిక్కలాడు పారిపోవడం మొదలెట్టాడు. వెనక ఎలమంద, వీరన్న, మస్తాను, రంగయ్య ఇంకొందరు కర్రలు తీసుకుని తిక్కలాడ్ని వెంబడిస్తున్నారు.

'అరేయ్‌ఈణ్ణియ్యాల సఫాచేసేయాల' అంటున్నారొకరు. 'వద్దు, కేసవుద్ది, కాలో సెయ్యో తీసెయ్యాల' అంటున్నాడొకడు. తిక్కలాడు తన శక్తి కొద్దీ పరిగెడుతున్నాడు. నవ్వుతున్నాడు, పరిగెడుతూ నవ్వుతున్నాడు. ముక్కులోంచి, వీపులోంచి కారే రక్తంతో చిరిగిన చొక్కా, లాగూ ముద్ద ముద్ద అయినాయి.

పరిగెడుతూనే గుడి దగ్గరి కొచ్చాడు. గుడి తలుపులు మూసి ఉన్నాయి. వెనక గుంపు వెంబడిస్తూనే వుంది. తిక్కలాడికి ఏం చెయ్యాలో తోచడం లేదు. 'ఒరేయ్ రాము డా దేవుడా రక్షించు' అంటున్నాడు. అంటూ పరిగెడుతున్నాడు. వెనక ఆగ్రహోదగ్రులైన గుంపు వెంబడిస్తూనే ఉంది. తిక్కలాడిలో శక్తి నశించి పోతోంది, కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఏమీ కనిపించడం లేదు. వెంబడిస్తున్న గుంపు దగ్గరవసాగింది. ఊరి మూల మలువు దగ్గర వేగంగా వస్తున్న లారీ తిక్కలాడ్ని గుద్దింది. చివరిగా తిక్కలాడు 'రాముడా రా...' అని నేలకొరిగాడు. ◆